ఓటర్ల జాబితాలు పారదర్శకంగా ఉండాలి

భీమడోలు: ఓటర్ల జాబితాలు పారదర్శకంగా ఉండాలని, బీఎల్‌వోలు అశ్రద్ధ వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఉంగుటూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఏలూరు ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి అన్నారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరంలో భాగంగా పూళ్లలోని ఉన్నత పాఠశాలలోని 70 నుంచి 75 ఉన్న పోలింగ్ కేంద్రాలను ఆయన ఆదివారం ఆకస్మిక తనిఖీ చేసారు. ముసాయిదా ఓటర్ల జాబితాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ముసాయిదా ఓటర్ల జాబితాల్లోని ప్రతి ఓటరుకు వివరాలు సక్రమంగా ఉన్నదీ లేనిదీ పరిశీలించారా అని బీఎల్‌ఓలను ప్రశ్నించారు. ప్రతి ఇంటిని జల్లెడ పట్టాలని, ఇంటిలోని ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కలిగి ఉన్నదీ లేనిదీ పరిశీలించి, అవసరమైతే వారితో సంబంధిత దరఖాస్తు చేయించాలన్నారు. తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ మాట్లాడుతూ రెండు రోజులుగా మండలవ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల శిబిరంలో కొత్తగా ఓటు కోసం 487 మంది, మృతి చెందిన వారి పేర్లు తొలగింపునకు 44 మంది, సవరణల కోసం 89 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ షంషూద్దీన్, వీఆర్వో వినయ్, ఇంతియాఫ్ పాల్గొన్నారు.



పూళ్ల ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాల్లోని బీఎల్‌వోల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి



గోపన్నపాలెంలో ఎన్నికల ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్న తహసీల్దార్ ఎన్‌శీ నాంచారయ్య

ఉంగుటూరులో..

ఉంగుటూరు: ఉంగుటూరు నియోజకవర్గం నాలుగు మండలాల్లో నిర్వహించిన ప్రత్యేక క్యాంపులు ద్వారా 2393 దరకాస్తులు ఓటర్లు నుంచి వచ్చాయని తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. 214 పోలింగు కేంద్రాలలో జరిగిన ఈ ప్రక్రియలో ఓటరుగా నమోదు కోసం 1442 దరఖాస్తులు, తొలగింపులు కోసం 304 దరఖాస్తులు, మార్పులు కోసం 647 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దారు వెంకటరమణ చెప్పారు.

18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు

ఉంగుటూరు: 2024 జనవరి 1నాటికి 18 ఏళ్లు ఉంటే ఓటరుగా నమోదు చేయాలని ఏలూరు ఆర్డీవో కాజా వల్లీ సూచించారు. ఆదివారం ఉంగుటూరు మండలం కైకరం, చేబ్రోలులోని పోలింగ్ కేంద్రాలను, ప్రత్యేక కేంద్రాలను ఆర్డీవో పరిశీలించారు. అనంతరం నియోజకవర్గంలోని 214 పోలింగ్ కేంద్రాల బీఎల్వోలతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో, ఓటర్ల నమోదులో అశ్రద్ధ వహించవద్దని ఆర్డీవో సూచించారు.

118 దరఖాస్తుల స్వీకరణ

దెందులూరు: మండలంలో ఆదివారం గ్రామగ్రామాన 66 పోలింగ్ స్టేషన్‌లో రెండవ రోజు ప్రత్యేక ఎన్నికల శిబిరం నిర్వహించారు. ఫారం- 6, 7, 8కి సంబంధించి 118 రకాల దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య అన్నారు. సోమవరప్పాడు, గోపన్నపాలెం, గాలాయగూడెం, గంగన్నగూడెం, జోగన్నపాలెంలో పోలింగ్ స్టేషన్లను తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య తనిఖీ చేశారు.

బాణసంచా విక్రేతలు నిబంధనలు పాటించాలి

దెందులూరు: దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా వ్యాపారులు నిబంధనలు పాటించాలని, దుకాణాల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పెదవేగి సీఐ కే.శ్రీనివాస్ సూచించారు. ఆదివారం దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ మందుగుండు సామగ్రి తయారీ, నిల్వ కేంద్రాలు, దుకాణాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఫైర్ అలారం ఏర్పాటుతో పాటు అత్యవసర పరిస్థితుల్లో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించేలా తయారీ కేంద్రాల వారికి అవగాహన కల్పించాలన్నారు. నివాసాలకు దూరంగా బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి దుకాణానికి మూడు మీటర్ల దూరం తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రతి దుకాణం వద్ద రెండు అగ్నినిరోధక సిలిండర్లు, రెండు బకెట్ల పొడి ఇసుక, నీరు అందుబాటులో ఉంచుకునేలా చూడాలన్నారు. ఎవరైనా అనధికారికంగా మందుగుండు సామగ్రి అమ్మినా, తయారు చేసినా వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాన్నారు. 100,112 నంబర్లకు ఫోన్ చేసి అక్రమంగా అమ్మకాలు చేస్తే సమాచారం అందించాలని సీఐ కే.శ్రీనివాస్ వివరించారు.

క్లుప్తంగా

సచివాలయ భవనాలు త్వరగా పూర్తి చేయండి



చేబ్రోలు సచివాలయ భవనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో కాజా వల్లీ

ఉంగుటూరు: సచివాలయ భవనాలు, వెల్‌నెస్ సెంటర్లు, ఆర్‌బీకే భవనాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఏలూరు ఆర్డీవో ఖాజా వల్లీ ఆదేశించారు. ఎంపీడీవోకు సూచనలు చేశారు. ఆదివారం చేబ్రోలులో నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనాన్ని, వెల్‌నెస్ సెంటరును ఆర్డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబరు 15వ తేదీలోపు మిగిలిన భవనాలను పూర్తి చేయాలని ఆర్డీవో కాజావల్లీ అధికారులను ఆదేశించారు.

రైతు భరోసా కేంద్రం సిద్ధం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న దెందులూరులోని రైతుభరోసా కేంద్రం

దెందులూరు: దెందులూరు ఎస్ఎంఆర్ నగర్‌లో రైతు భరోసా కేంద్రం-2 నిర్మాణం పూర్తయింది. సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లు అతి త్వరలోనే ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చేతులు మీదుగా ప్రారంభోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ నాయకులు, దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణోత్సవం



భీమడోలులో శ్రీసీతారామ స్వామి వార్ల కల్యాణోత్సవ నిర్వహిస్తున్న పండితులు

భీమడోలు: భీమడోలులో నూతనంగా ప్రతిష్ఠించిన శ్రీకోదండ రామాలయంలోని శ్రీసీతారాముల కల్యాణోత్సవం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. స్తపతి రావిపాటి వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో అర్చక బృందం సీతారాముల కల్యాణాన్ని వేదమంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారాములును విశేషంగా అలంకరించారు. నూతన ఆలయంలో తొలి కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భారీ సంఖ్యలో భక్తజనం తరలి రావడంతో ఆ ప్రాంతమంతా కిటకిటలాడింది.

దివ్యాంగులకు వితరణ



గుండుగొలనులో దివ్యాంగులకు వితరణ అందిస్తున్న దృశ్యం

భీమడోలు: గుండుగొలనులోని విఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం దివ్యాంగులకు వితరణ కార్యక్రమం చేశారు. దాతలు కొల్లూరి గోపాలకృష్ణ, పూర్య రామతేజల పేరుతో వారి కుటుంబ సభ్యులు దివ్యాంగులకు సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. దివ్యాంగులకు సన్నబియ్యం, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భరత నాట్యం చేసి అలరించిన విద్యార్థులను, దాతలను నిర్వాహకులు సత్కరించారు. తొలుత జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ షేక్ సాబ్జి, సినిమా నటులు దిల్ రమేష్, గౌతమ్‌రాజు, సినీ నిర్మాత కోసూరు రమేష్‌రాజు, షార్ట్ ఫిల్మ్స్ డైరెక్టర్ తోట రవి, నిర్వాహకులు దాట్ల సీతారామరాజు, దాట్ల రామకృష్ణంరాజు, పేరిచర్ల శ్యామలరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్తలకు సత్కారం



కార్యకర్తలను సన్మానిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: బయ్యనగూడెం పంచాయతీ పరిధిలోని వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్తలు మద్దిపాటి శ్రీను, అల్లం సూరిబాబులను సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం పార్టీ శ్రేణులు ఘనంగా సత్కరించారు. తాపీ మేస్త్రీలుగా జీవనం సాగిస్తూ.. సాయంత్రం నుంచి నవరత్న పథకాలపై ప్రచారం నిర్వహిస్తూ వైఎస్సార్ సీపీపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేందుకు కృషి చేస్తుండడం అభినందనీయమని వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు అన్నారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆదేశాల మేరకు మద్దిపాటి శ్రీను, అల్లం సూరిబాబుకు సర్పంచ్‌ల చాంబర్ నియోజకవర్గ అధ్యక్షుడు గేలం త్రివిక్రమ సోమరాజు సత్కరించారు.

2.50 లక్షల శివలింగాలతో ఊరేగింపు



ప్రత్యేక అలంకరణతో శివలింగం



అభిషేకాలు చేస్తున్న నిర్వాహకులు

దెందులూరు: దెందులూరులో ఆదివారం శ్రీరామదండు ఆధ్వర్యంలో బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు, డైరెక్టర్ సుగ్గిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో శివునికి పంచామృత ఫలరసాల అభిషేకాలు, పూజలు, ప్రత్యేకాలంకరణ చేశారు. ఏడు రోజులుగా కళాశాలలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు తయారు చేసిన 2.50 లక్షల మట్టితో తయారు చేసిన శివలింగాలను ఊరేగింపుగా కళాశాల నుంచి సాయిబాబా ఆలయం వరకు రామదండు కమిటీ, దెందులూరు కోలాట కమిటీ ఆధ్వర్యంలో వందలాది మంది భక్తులతో శివనామస్మరణతో దెందులూరు మార్మోగింది. సాయిబాబా గుడి నుంచి హైదరాబాద్‌కు చెందిన విజయానందరామచంద్ర స్వామి ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమి నాటికి 2.50 లక్షల శివలింగాలను కాశీకి చేర్చి అక్కడ కార్తీక పౌర్ణమి రోజున గంగాజలంతో అభిషేకం చేసి గంగలో నిమజ్జనం చేస్తామని కరస్పాండెంట్ నూకరాజు అన్నారు. తొలుత నర్సింగ్ కళాశాలలో నిర్వాహకులు సుగ్గిశెట్టి నూకరాజు దంపతులు, మొటపర్తి రాజా దంపతులు పంచామృత ఫలరసాలతో స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. 108 మంది ముత్తైదువులకు పసుపు, కుంకుమ అందజేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసినట్టు శ్రీరామదండు కమిటీ సభ్యులు బుజ్జి గోపాల్ అన్నారు.

ఘనంగా ఇన్నర్ వీల్ క్లబ్ శత వార్షికోత్సవం



ఇన్నర్‌వీల్ క్లబ్ విశిష్ట మహిళ పురస్కారం అందుకుంటున్న మేయర్ షేక్ నూర్జహాన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రతిష్టాత్మకమైన సేవా సంస్థ ఇన్నర్‌వీల్ క్లబ్ శతవార్షికోత్సవ కార్యక్రమం ఆదివారం స్థానిక సీఆర్ఆర్ కళాశాల ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ మార్గరెట్ ఆలివ్ గోల్డింగ్ అనే నర్స్ స్థాపించిన ఇన్నర్ వీల్ క్లబ్‌ను స్నేహం ,సేవ ధ్యేయంగా మహిళలు నిర్వహిస్తూ అంతర్జాతీయ సేవా సంస్థగా విరాజిల్లుతోందన్నారు. క్లబ్ 100వ సంవత్సరంలోకి అడుగు పెట్టిన సందర్భంగా వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వంద మంది మహిళలకు విశిష్ట మహిళ పురస్కార ప్రదానోత్సవం చేసి, ఘనంగా సత్కరించారు. పురస్కారం అందుకున్న వారిలో ఏలూరు నగర మేయర్ నూర్జహాన్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో పాటు డాక్టర్లు, లాయర్లు, లెక్చరర్లు, టీచర్లు, వివిధ సంస్థల అధ్యక్షులైన మహిళలు, మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు. అంతకు ముందు క్లబ్ చైర్మన్ అఫీషియల్ విజిట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాండింగ్ ఇన్నర్ వీల్‌లో భాగంగా స్థానిక శాతవాహన నగర్‌లో ఇన్నర్ వీల్ పోల్ ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థినులకు సైకిళ్లు, స్మార్త వేద పాఠశాలలో విద్యార్థుల కోసం ఫ్యాన్లు, పాఠశాల విద్యార్థులకు క్రీడా పరికరాలు పంపిణీ చేశారు.

నేటి నుంచి రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులకు శిక్షణ

భీమడోలు: మండలంలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులకు ఈనెల 6 నుంచి 17 వరకూ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు భీమడోలు ఏపీఎం సురేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మండల పరిధిలోని 80 రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులకు వారికి అవసరమైన నిధులు, వసతులపై శిక్షణ వివరించారు. ఈ నెల 6,7వ తేదీల్లో ఆగడాలలంక పరిధిలోని సంఘాలకు, 13, 14వ తేదీల్లో గుండుగొలను, పూళ్ల ఏరియాలోని రైతు సంఘాలకు, 15, 16, 17వ తేదీల్లో భీమడోలు ఏరియాల్లోని రైతు సంఘాల సభ్యులకు శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. సభ్యులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

భీమడోలు: మండలంలోని ఆగడాలలంకలో గ్రామంలో ఆదివారం సాయంత్రం పేకాట శిబిరంపై భీమడోలు పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. భీమడోలు సీఐ బీబీ రవికుమార్ నేతృత్వంలో భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేశారు. పేకాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.25,860లు స్వాధీనం చేసుకున్నారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి



విశ్వరూప మహాసభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 11న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. స్థానిక ఆర్ఆర్‌పేట బాలయోగి వంతెన వద్ద ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పలివెల చంటి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దీనికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరు కానున్నట్లు తెలియజేసారు. ఎస్సీ వర్గీకరణ జరిగితే 59 ఉపకులాలకు పూర్తి న్యాయం జరుగుతుందన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు, కాశీ కృష్ణ, తనగల శేఖర్, ఎంఎస్‌పీ నాయకులు నమ్మిన నాగార్జున పాల్గొన్నారు.

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలి



భీమడోలులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భీమడోలు: 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20 వరకూ నిర్వహిస్తారని, వీటిని విజయవంతం చేయాలని కోరుతూ భీమడోలులో శాఖా గ్రంథాలయం విద్యార్థినీ విద్యార్థులు ర్యాలీ చేశారు. గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీని గ్రంథాలయ అభివృద్ధి కమిటి చైర్మన్ తుమ్మల ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్‌లు ప్రారంభించారు. తొలుత పాఠశాలలో చదవడం మాకిష్టం, పుస్తక ప్రదర్శన కార్యక్రమాలను నిర్వహించారు. వారోత్సవాలు సందర్భంగా వ్యాస రచన, వక్తృత్వం, చిత్రలేఖనం, కవి సమ్మేళనం, రచయితల సందేశాలు, డ్రగ్స్ నివారణకు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై పోటీలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు అమానుషం



ఏలూరులో మాట్లాడుతున్న ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి హనుమంతరెడ్డి

ఏలూరు (టూటౌన్): పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులు అమానుషమని ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి కె.హనుమంతరెడ్డి అన్నారు. అసోసియేషన్ ఏలూరు యూనిట్ సమావేశం స్థానిక ఆర్ఆర్‌పేటలోని స్ఫూర్తి భవన్‌లో సీనియర్ న్యాయవాది పీపీ శాస్త్రి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హనుమంత రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా, దేశవ్యాప్తంగా రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా వస్తున్న మార్పులను ప్రజలకు వివరించేందుకు ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను, ఇటీవల దేశంలో మణిపూర్‌లో మతోన్మాదుల దాడులను వివరించారు. ఈ సమావేశంలో, న్యాయవాది పీపీ శాస్త్రి, విశ్రాంత న్యాయమూర్తి పి.లక్ష్మి, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఆర్.శ్రీనివాస డాంగే తదితరులు మాట్లాడారు. సభ అనంతరం ప్రోగ్రెసివ్ ఫోరం ఏలూరు యూనిట్ కమిటీ 12 మందితో ఎన్నికైంది. యూనిట్ గౌరవ అధ్యక్షుడిగా రెడ్డి శ్రీనివాస డాంగే, అధ్యక్షుడిగా న్యాయవాది పీఎస్ చందు, కార్యదర్శిగా సబ్బి అజయ్ కుమార్, కోశాధికారిగా బి.రాము ఎన్నికయ్యారు.

వైభవంగా గంగానమ్మ సంబరాలు



కలశాలతో ఊరేగింపులో పాల్గొన్న చిన్నారులు, యువతులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కొత్తపేట 42వ డివిజన్లో వేంచేసి ఉన్న గంగానమ్మ, పోతురాజు బాబు స్నాన సంబరాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 108 మంది సువాసినీలు, 101 మంది అక్క, చెల్లెళ్లతో సుమారు 250 కలశాలతో నగర వీధుల్లో భారీ ఊరేగింపు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఘటాల ఊరేగింపు నిర్వహించగా భక్తులు దారి పొడవునా అమ్మవారికి పోతురాజు బాబుకు మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం అమ్మవారికి ధూప, దీప, నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, నగర వీధుల్లో భజనలతో వైభవంగా ఊరేగించారు. ఊరేగింపులో సినీ, కోయ డ్యాన్స్, భూత, బేత వేషధారణలు, కోలాటం, శక్తి వేషాలతో కళాకారులు అలరించారు. ఈ సందర్భంగా 42వ డివిజన్లోని ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఏటా రెండు, మూడు డివిజన్ల ప్రజలు కలిసి అమ్మవారి ఉత్సవాలు చేసుకునే వారమని, ఈ ఏడాది మొట్టమొదటగా తామే స్వయంగా ఉత్సవ నిర్వహణకు పూనుకున్నామన్నారు. సహాయ, సహకారాలు అందించిన ప్రజాప్రతినిధులకు, డివిజన్ పెద్దలకు, పోలీస్ అధికారులకు, భక్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆలయ అర్చకులు మాటా డుతూ ఈరోజు వందలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారికి కుంభం పోసి, చద్ది నైవేద్యంతో పాటు. బూరెలు, గారెలు, పులిహోర, క్షీరాన్నంతో నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారని తెలిపారు. ఏటా ఉత్సవాలు నిర్వహించి గ్రామదేవతలను శాంతింపజేస్తే ప్రజలు అమ్మవారు, పోతురాజు కరుణాకటాక్షాలతో సుఖ సంతోషాలు చల్లగా జీవిస్తారని వారన్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి పరుగు

- కోటేశ్వరదుర్గాపురంలో రూ.3.55 కోట్ల వ్యయంతో పనులు
- ప్రభుత్వ భవన నిర్మాణాలు పూర్తి
- త్వరలో ప్రారంభించనున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



రూ.17.50 లక్షలతో పూర్తి చేసిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్

ఏలూరు రూరల్: గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులు వేగంగా పూర్తవడంతోపాటు ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యాయి. ఏలూరు రూరల్ మండల గ్రామం కోటేశ్వరదుర్గాపురంలో వైఎస్సార్ సీపీ పాలన నాలుగున్నరేళ్లలో గ్రామంలో రూ.3.55 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేసారు. త్వరలో స్థానిక ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి చేతుల మీదుగా పూర్తయిన నూతన ప్రభుత్వ భవనాలను ప్రారంభించనున్నారు. 2019 ముందు ఈ గ్రామంలో ఒక్క ఎయిడెడ్ పాఠశాల మాత్రమే ఉంది. అదీ కూడా శిథిలావస్థకు చేరింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాలను ప్రభుత్వ పరం చేసారు. వెంటనే అధికారులు నాడు-నేడు పథకం ద్వారా రూ.14.72 లక్షలు ఖర్చు చేసి పాఠశాలను అభివృద్ధి చేసారు. ఫలితంగా నేడు మౌలిక వసతులు, విద్యార్థులతో పాఠశాల కళకళలాడుతోంది. టీడీపీ హయాంలో చెరువు నీటిని సంపులోనికి పంపించి ప్రజలకు తాగునీరు అందించేవారు. శివారు ప్రాంతాల ప్రజలకు ఈ నీరు సైతం అందడం గగనమయ్యేది. వేసవికాలంలో నీటి కోసం ప్రజలు నానా అగచాట్లు పడేవారు.

వైఎస్సార్ సీపీ పాలనలో తొలగిన సమస్యలు

వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు మాధవాపురం వద్ద రూ.25 లక్షల రూర్బన్ నిధులతో ఓవర్‌హెడ్ ట్యాంక్ ఏర్పాటు చేశారు. దీనికి తోడు జలజీవన్ మిషన్ నిధులు రూ.8.50 లక్షలతో కొత్త తాగునీటి పైప్‌లైన్ వేసి ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసారు. ప్రజలందరికీ సురక్షిత తాగునీరు అందుతోంది. 30 ఏళ్ల నుంచి ప్రజలు కంకర మట్టి లేదా బురద రోడ్లపై రాకపోకలు సాగించారు.



రూ.35 లక్షలతో నిర్మించిన సచివాలయం



నూతన సీసీ రోడ్డు



ఎంపీపీ నిధులతో నిర్మించిన కల్వర్టు

ఊహించలేని అభివృద్ధి



నేను సర్పంచ్‌గా పనిచేస్తున్న సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామంలో సుమారు రూ.3.55 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేయడం ఎంతో సంతోషంగా ఉంది. గతంలో రూ.10 లక్షలకు మించి అభివృద్ధి పనులు జరగలేదు. ఇంత పెద్దఎత్తున నిధులు మంజూరు చేసినందుకు సీఎం జగన్, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఎంపీపీలకు గ్రామ ప్రజలు ఎంతో రుణపడి ఉంటారు.

– వగ్రీ లక్ష్మీదుర్గ, సర్పంచ్

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామంలో రోడ్ల స్వరూపం మారింది. రూ.55 లక్షల అర్బన్ నిధులు, మరో రూ.20 లక్షల గడప గడపకు మన ప్రభుత్వం నిధులు ఖర్చు చేసి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు పెద్ద ఎత్తున సీసీ రోడ్లు నిర్మించారు. ప్రస్తుతం బురద రోడ్లు ఎక్కడా లేవు. వీటికి తోడు గ్రామంలో రూ.35 లక్షలతో సచివాలయ భవనం నిర్మించారు. మరో రూ.17.50 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నిర్మించారు. రూ.12 లక్షల మండల పరిషత్ నిధులతో 3 కల్వర్టులు నిర్మించారు. రైతుల పాల సేకరణ పెంచేందుకు రూ.18.20 లక్షలతో మిల్క్ కలెక్షన్ యూనిట్ భవనం ప్రభుత్వం మంజూరు చేసింది. నాలుగేళ్లలో వైఎస్సార్ సీపీ పాలనలో సంక్షేమ పథకాలద్వారా సుమారు 570 మంది లబ్ధిదారులు రూ.2,31,18,536 అందుకోవడం మరో విశేషం.